క్లుప్తంగా

ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గుంత పూడ్చండి సారూ!



ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు మండలం నందమూరు వద్ద తేలప్రోలు– ఉయ్యూరు ఆర్‌అండ్‌బీ రహదారిపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. రహదారి కుంగిపోయి భారీగా గుంత ఏర్పడినప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు కనీస మరమ్మతులు చేపట్టడం లేదు. నిత్యం వందలాది వాహనాల రాకపోకలతో ఈ రహదారి రద్దీగా ఉంటుంది. దీంతో వేగంగా వచ్చే వాహనాలు ఆ గుంతలో పడి ప్రమాదానికి గురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని వాహనదారులు కోరుతున్నారు.

బాలల ఆరోగ్య రక్షణ అందరి కర్తవ్యం



గన్నవరం రూరల్: బాలల ఆరోగ్యం పరిరక్షణకు అందరూ కృషి చేయాలని ఆత్కూరు పీహెచ్‌సీ డాక్టర్ జితేంద్రకుమార్ ఆదేశించారు. రాష్ట్ర బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా తెంపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. నిరంతరం బాలల ఆరోగ్యాన్ని సమీక్షించాలని సిబ్బందికి సూచించారు. పౌష్టికాహారం ఇవ్వాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు, అంగన్‌వాడీ కార్యకర్త కల్పన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వంశీని మర్యాదపూర్వకంగా కలిసిన మోహన్ యాదవ్



గన్నవరం: మాజీ ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్‌ను శనివారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి గోదావరి జిల్లాల అనుబంధ విభాగాల ఇన్‌చార్జ్ కొలుసు మోహన్‌యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుల్లో జైలు నుంచి ఇటీవల విడుదలైన వంశీ మోహన్‌కు ఆయన సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ అనుబంధ విభాగాల విషయమై ఆయనతో మోహన్‌యాదవ్ చర్చించారు. నియోజకవర్గానికి సంబంధించి గ్రామ స్థాయి నుంచి అనుబంధ విభాగాల పదవులను భర్తీ చేయాల్సిందిగా కోరారు. స్పందించిన వంశీమోహన్ త్వరలో పార్టీ సమావేశం నిర్వహించి పదవుల నియామకాన్ని పూర్తిచేయనున్నట్లు తెలిపారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో రోడ్డు నిర్మించాలి



నున్న(విజయవాడరూరల్): నున్న ఎస్సీ కాలనీలో సీఎస్ఐ చర్చి ఎదురు రోడ్డు పగిలిపోయి కుంగి నడవటానికి వీల్లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 25 సంవత్సరాల క్రితం నిర్మించిన సిమెంటు రోడ్డు అక్కడక్కడా మధ్యలో పగిలిపోయింది. కొన్నిచోట్ల కుంగిపోవడంతో నడిచేందుకు వీల్లేకుండా ఉంది. ఆ రోడ్డు నిర్మించాలని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు ప్రత్తిపాటి రవీంద్ర పలు దఫాలు గ్రామ పంచాయతీ, మండల పరిషత్ సాధారణ సమావేశాల్లో కోరారు. అయినా పాలక వర్గం రోడ్డు నిర్మించడంలో ఉదాసీన వైఖరి అవలంభిస్తున్నారని స్థానికులు అంటున్నారు. రోడ్డు నిర్మాణంతో పాటు డ్రెయిన్ కూడా నిర్మించాలని స్థానికులు ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

అడుగుకో గుంతతో అవస్థలు

- అభివృద్ధి జాడ ఏదీ?
- గోతులమయంగా కంకిపాడు లాకురోడ్డు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



గోతులమయంగా మారిన కంకిపాడు- రొయ్యూరు రోడ్డు మార్గం

కంకిపాడు: ప్రధాన రహదారులు అన్నీ ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి చేస్తామన్న కూటమి ప్రభుత్వం మాటలు కేవలం ప్రచారానికే పరిమితం అయ్యాయి. చాలా వరకూ రహదారులు అధ్వానంగా ఉన్నాయి. కనీసం మరమ్మతులకు నోచుకోకపోవటంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న దుస్థితి.

గుంతలమయంగా లాకురోడ్డు..

విజయవాడ- మచిలీపట్నం రహదారి నుంచి బస్టాండు సెంటరు మీదుగా రొయ్యూరు జెడ్పీ రోడ్డు మార్గం ఉంది. కంకిపాడు, తోట్లవల్లూరు మండలాలకు అనుసంధానంగా ఉన్న రోడ్డు మార్గమే కాకుండా దివిసీమ కరకట్టను కలుపుతూ ఉన్న ప్రధాన మార్గం ఇది. బస్టాండు సెంటరు నుంచి బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వరకూ, వైన్ షాపు సెంటరు నుంచి లాకుల వరకూ ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైంది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనాల రాకపోకలకు అసౌకర్యంగా ఉంది. హెవీ లోడుతో ఉన్న ఇసుక లారీలు ఇటీవల కాలంలో రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు పరిస్థితి మరింత అధ్వానమైంది. గుంతలు, కోతకు గురైన మార్జిన్ల గుండా రాకపోకలు సాగించలేక రహదారి కష్టాలను ఎదుర్కొంటున్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీసీ రోడ్డు..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం సెంటరు సమీపం నుంచి వైన్ షాప్ సెంటరు వరకూ సీసీ రోడ్డును నిర్మించారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, అప్పటి ప్రభుత్వ సహకారంతో జిల్లా పరిషత్ నుంచి రూ.50 లక్షలు నిధులు సమీకరించి సిమెంటు రోడ్డును అభివృద్ధి చేయించారు. రహదారి ఇక్కట్లు తీరటంతో ప్రజలు ఊరట చెందారు. అయితే మిగిలిన రోడ్డు మార్గం నేటికీ అభివృద్ధికి నోచుకోలేదు.

కన్నెత్తి చూడని కూటమి ప్రభుత్వం

ప్రధాన రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామని ప్రచారం చేసుకున్న కూటమి ప్రభుత్వం నేటికీ ఆ దిశగా చర్యలు తీసుకోవటం లేదు. ప్రధాన రహదారుల్లో ఒకటైన లాకురోడ్డు గుంతలమయంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా కూటమి నేతలు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. గత ప్రభుత్వంలో ఈ రోడ్డుపై నిరసనలు వ్యక్తం చేసిన టీడీపీ వర్గాలు నేడు సమస్య గురించి గొంతెత్తి మాట్లాడని పరిస్థితి. ఫలితంగా అధ్వానంగా ఉన్న రోడ్డు పరిస్థితి ఎప్పటికి మారుతుందోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

శ్రీగాయత్రి మందిరానికి నూతన కార్యవర్గం



ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గం

గన్నవరం: స్థానిక సొసైటీపేటలోని శ్రీగాయత్రి మందిరం నిర్వాహణ కమిటీ అధ్యక్షుడిగా డాక్యుమెంట్ రైటర్ కేవీఆర్.కిషోర్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం మందిరంలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా నాదెండ్ల మోహన్, విష్ణుమూర్తి, కడియాల రవి, కంభంపాటి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా ఎస్‌వీ. గోపాలకృష్ణ, కోశాధికారిగా జీవీ.హనుమంతరావు, ఉపాధ్యక్షులుగా ఎస్.రవికుమార్, కే.శివరామకృష్ణ, వెన్నూతల సుబ్బారావు నియమితులయ్యారు. సహాయ కార్యదర్శులుగా శ్రీకాంత్‌శర్మ, సీహెచ్.బాలభాస్కర్‌శర్మ, న్యాయ సలహాదారుగా జీఎస్ఆర్.మూర్తి, గౌరవ సలహాదారులుగా ఎస్.వెంకటేశ్వరశర్మ, జీ.గోపాలకృష్ణ శర్మ, పీఆర్వోలుగా కే.శ్రీవత్స, వీవీ.కృష్ణమోహన్, మరో 11 మంది సభ్యులతో నూతన కమిటీ ఏర్పడింది. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కిషోర్ మాట్లాడుతూ గతంలో అధ్యక్షులుగా పనిచేసిన బాలకృష్ణమూర్తి మరణంతో నిలిచిన మందిర నిర్వాహణ కార్యక్రమాలను నిరాటంకంగా కొనసాగిస్తామని తెలిపారు. అందరి సహకారంతో గాయత్రి మందిరం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

పది మంది ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న మానవత ప్రతినిధులు

గన్నవరం: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక విశ్వభారతి నవోదయ, సైనిక్ కోచింగ్ ప్రాంగణంలో శనివారం గురు పూజోత్సవం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ సేవలు అందిస్తున్న పది మంది ఉపాధ్యాయులను దుశ్శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఆ సంస్థ గన్నవరం శాఖ చైర్మన్ మడుపల్లి బాలకృష్ణమూర్తి మాట్లాడుతూ సమాజంలో ఉపాధ్యాయవృత్తి పవిత్రమైనదని చెప్పారు. విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత వీరిపైనే ఉందన్నారు. విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు, విశ్రాంత ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ ముక్కామల సుబ్బారావు, మానవత కన్వీనర్ కర్రా వరప్రసాద్, అధ్యక్షుడు వీసం ప్రసాదరావు, విద్యా విభాగం డైరెక్టర్ సయ్యద్ లాల్, కార్యదర్శి వీవీ. కృష్ణమోహన్, కోశాధికారి పొట్లూరి రామకృష్ణ, ఉపాధ్యక్షులు పువ్వుల ఆదినారాయణ, సంయుక్త కార్యదర్శి వీ.వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

బిల్డింగ్ వర్కర్స్ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



భవన నిర్మాణ కార్మికులతో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రాజనాల సురేష్

హనుమాన్‌జంక్షన్ రూరల్: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15వ తేదీన విజయవాడలోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజనాల సురేష్ కోరారు. హనుమాన్ జంక్షన్‌లోని భవన నిర్మాణ కార్మికుల అడ్డాల వద్ద శనివారం ఉదయం వర్కర్లకు కరపత్రాలను పంపిణీ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు గతంలో మాదిరిగా ప్రమాద బీమా, మహిళా కూలీలకు వివాహ, ప్రసవ సమయాల్లో ఆర్థికసాయం, పిల్లల చదువులకు ఉపకార వేతనాలు అందించాలన్నారు. ఈ నెల 15న భవన నిర్మాణ కార్మికులంతా పనులు నిలుపుదల చేయాలని, లేబర్ కమిషనర్ ఎదుట మహాధర్నాకు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ నూరిల్లా, కరీమ్ పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 31వ డివిజన్ ముత్యాలంపాడులో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు గుండె, కంటి, ఎముకలు, కీళ్ల సమస్యలకు సంబంధించి 200 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. పిన్నంరాజు త్రిమూర్తి రాజు, నవనీతం సాంబశివరావు, డి.మురళీకృష్ణంరాజు, బెజ్జం సురేష్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

పెనమలూరు: కానూరు సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో శనివారం విద్యార్థులు స్వచ్ఛపక్వాడా కార్యక్రమం నిర్వహించారు. కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు కాలేజీ ప్రాంగణంలో చెత్త ఎత్తి పరిశుభ్రం చేశారు. పర్యావరణం పరిరక్షణలో భాగంగా కాలేజీ ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులకుస్వచ్ఛపక్వాడా, పచ్చదనంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉప కులపతి ప్రొఫెసర్ పి.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జె.శివరామ్‌ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

వినాయకుడికి దేవభక్తుని ప్రత్యేక పూజలు



వినాయకుడికి పూజలు చేసి ఆశీర్వాదం పొందుతున్న దేవభక్తుని చక్రవర్తి

పెనమలూరు: కానూరులో శనివారం 25 వేల మంది భక్తులకు అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సిరినగర్‌లో గత 18 రోజులుగా వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా భక్తులకు అన్నాదానం చేశారు. వేమూరి సురేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఈ కార్యక్రమం నిర్వహించగా వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవభక్తుని చక్రవర్తి పాల్గొన్నారు. ఆయన స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల అన్నసమారాధనలో పాల్గొని భక్తులను భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో తాడిగడప మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వేమూరి బాలకృష్ణ, భక్తులు పాల్గొన్నారు. వినాయకుడి భారీ విగ్రహాన్ని ఆదివారం ప్రత్యేకంగా ఊరేగించి నిమజ్జనం చేస్తారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే




సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని రవీంద్ర భారతి స్కూల్‌లో పేరెంట్స్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వారి అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలతో కలసి పాఠశాలలో సందడి చేశారు. ముఖ్యఅతిథిగా విద్యాసంస్థ చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ పాల్గొన్నారు. గ్రాండ్ పేరెంట్స్, కుటుంబ వ్యవస్థలపై విద్యార్థులకు బోధించారు. తాతామనుమలను శాలువాలతో సత్కరించి అభినందించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గ్రాండ్ పేరెంట్స్‌కు నిర్వహించిన పలు ఆటల పోటీలలో తమ మనవళ్లతో పోటీపడుతూ వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు విద్యాసంస్థ చైర్మన్ బహుమతులను అందజేశారు. స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ శాంతి, ప్రిన్సిపాల్ నిమ్మగడ్డ హెబ్సా ప్రసాద్, రమేష్, సరళాదేవి, కిరణ్మయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యూట్యూబ్ చానల్స్ విలేకరులపై కేసు

గన్నవరం: బియ్యం వ్యాపారులను బెదిరించిన ఇరువురు యూట్యూబ్ చానల్స్ విలేకరులపై గన్నవరం పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సూరంపల్లి సమీపంలోని బియ్యం గోదాం వద్దకు ఈ నెల 7వ తేదీన గుంటూరుకు చెందిన యూట్యూబ్ చానల్స్ విలేకరులు వెంకటేశ్వరరావు, వంశీ వచ్చారు. ఇక్కడ రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారని, తమకు రూ.60 వేలు ఇవ్వాలని గోదాం సిబ్బందిని బెదిరించారు. ఈ ఘటనపై గోదాం సిబ్బంది నరేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వెంకటేశ్వరరావు, వంశీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మోడువారిన చెట్లతో పొంచి ఉన్న ప్రమాదం



సూరంపల్లి ముసలమ్మ బావి మలుపులో ఎండిపోయిన చెట్టు

గన్నవరం రూరల్: ఎండిపోయి మోడువారిన చెట్లు ప్రమాద కరంగామారాయి. ఆర్‌అండ్‌బీ శాఖ నిర్లక్ష్యం ఇందుకు కారణమవుతోంది. మండలంలోని సూరంపల్లి అడ్డరోడ్డు నుంచి నున్న వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు మార్గంలో ఆ శాఖకు చెందిన చెట్లు మాడిపోయి మోడువారాయి. మొత్తంగా చెట్లు ఎండుపోయాయి. వీటి ఎండు కొమ్మలు రోడ్డుపై ప్రయాణించే బస్సులు, కార్లు, మోటారు సైకిళ్లపై పడిపోతున్నాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకుని ఈ చెట్లు తొలగించాలని కోరుతున్నారు. ప్రమాదాలు నివారించాలని డిమాండ్ చేస్తున్నారు.

లోక్ అదాలత్‌లో 826 కేసుల పరిష్కారం



గన్నవరం: స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులలో శనివారం నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 826 కేసులను పరిష్కరించారు. వీటిలో సివిల్ కేసులు 12, క్రిమినల్ కేసులు 811, పీఎల్‌సీ కేసులు మూడు ఉన్నాయి. తొలుత లోక్ అదాలత్‌ను సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార చైర్మన్ డాక్టర్ ఎస్.అరుణశ్రీ ప్రారంభించారు. రాజీకి అమోదయోగ్యమైన కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ దోహదపడుతుందన్నారు. దీనివల్ల కక్షిదారులకు సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.గాయత్రి, పలువురు కోర్టుల సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కరించాలని ఆందోళన



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

గన్నవరం: స్థానిక ఎస్సీ ఏరియాలో డ్రెయినేజీ సమస్య పరిష్కరించాలని కోరుతూ శనివారం కాలనీవాసులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళి మాట్లాడుతూ కాలనీలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ సమస్య కారణంగా మురుగునీటి పారుదల సక్రమంగా జరగడం లేదన్నారు. మురుగునీరు ఎక్కడికక్కడ స్తంభించిపోతోందన్నారు. రోజుల తరబడి రోడ్లపై మురుగునీరు నిలిచి ఉండడం వల్ల రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. పారిశుద్ధ్య సమస్యలు తలెత్తి పరిసర ప్రాంత ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి మురుగునీటి పారుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీవాసులు కొలకలూరి ఏసుపాదం, బుజ్జి, ప్రకాష్, ఏసు, సువార్తమ్మ, భరత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడులు నియంత్రించాలి



కంకిపాడు: రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులను నియంత్రించాలని, బీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు గుదే జయప్రకాష్ డిమాండ్ చేశారు. కంకిపాడు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈనెల 24న చేపట్టిన దళిత రణభేరి బ్రోచర్‌ను శనివారం ఆవిష్కరించారు. జయప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని అమలాపురం, కైకలూరు, మచిలీపట్నం, తదితర ప్రాంతాల్లో దళితులపై దాడులు పెరిగాయన్నారు. దాడులకు పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడులను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న చేపట్టిన దళిత రణభేరిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు ముజీబ్, మట్టిపల్లి లూసిపాల్, తాడిటోటి నరసింహారావు, గుమ్మడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వర్షం నీటితో ఇక్కట్లు



నున్న పవర్ గ్రిడ్ ఎదురురోడ్డుపై వర్షం నీరు

నున్న(విజయవాడరూరల్): నున్న, పాతపాడు, పి.నైనవరం గ్రామాల్లో కొద్దిపాటి వర్షానికే రోడ్లపై వర్షం నీరు నిలుస్తున్నాయి. రోడ్లు ఎత్తుపల్లాలుగా ఉండటం, రోడ్లపై అక్కడక్కడ గోతులు పడటం రోడ్లు మరమ్మతుల నిర్వాహణ లేక పోవడంతో వర్షం కురిసిన ప్రతిసారి రోడ్లపై నీరు నిలబడి రాకపోకలు సాగించే వారికి ఇబ్బంది కల్గిస్తున్నాయి. కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు ఎన్నికల సందర్భంలో మేము అధికారం చేపట్టిన వెంటనే రోడ్లను అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఆ మాటలు నీటి మీద రాతలయ్యాయి. నున్న గ్రామ పంచాయతి డ్రెయిన్లు నిర్మించాలని అనేక దఫాలు ఆర్‌అండ్‌బీ శాఖను కోరుతూ తీర్మానం చేసినా అతీగతి లేదు. మ్యాంగో మార్కెట్ వద్ద రోడ్డుకు ఇరువైపులా రోడ్డుపై నీరు నిలబడి వచ్చిపోయే వాహనాలతో వర్షం నీరు చింది నడిచే వారి చిందిపడి దుస్తులు మురికి అవుతున్నాయి. రోడ్డుమధ్యలో గోతులు పడి రాత్రి సమయంలో వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్లు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

శ్యామలాంబదేవి ఆలయం నూతన కార్యవర్గం



మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్య కాలనీలోని శ్యామలాంబదేవి అమ్మవారి ఆలయం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. శనివారం ఆలయ ధర్మకర్త చింతపల్లి కనకారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సీహెచ్ నాగసాయి, ఉపాధ్యక్షుడిగా గుర్రం స్వామి, ప్రధాన కార్యదర్శిగా వండాని అప్పలనాయుడు, కోశాధికారిగా ఉషాజ్యోతి, సంయుక్త కార్యదర్శిగా బి. రమణ, గోపి, ఈదుపల్లి సత్యనారాయణ, చోడిశెట్టి సాంబశివరావు, కరణం శ్రీరాములు తదితరులు ఎన్నికయ్యారు.